# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 286
పేజీలు : 08 | వెల: రూ.5/-
శుక్రవారం
ఆగస్టు 22, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


## కన్నుల పండువగా కనకదుర్గ పూజలు



నగరంలోని 32వ డివిజన్ శిరంగి రాజా రాం తోటలోని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఐదవ శ్రావణ శుక్రవారం సందర్భంగా దుర్గఅమ్మవారి అలంకరణలు, మల్లేశ్వర స్వామి అన్నపూజ అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామి వార్లను కన్నుల పండువగా తిలకించారు. అమ్మవారిని, స్వామివారిని దర్శించుకున్న భక్తులకు ఎల్లవేళలా వారి కృపా కటాక్షాలు ఉంటాయని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి, శ్రీ వీరాంజనేయ స్వామి సాయిబాబా దేవస్థానాల కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. – వరంగల్ వాయిస్, కరీమాబాద్



# ఆహారం పెట్టొద్దు

## బహిరంగ ప్రదేశాల్లో నిషేధం



- వీధికుక్కల బెడదపై సుప్రీం కీలక ఆదేశాలు
- ధిక్కరిస్తే చర్యలు అంటూ హెచ్చరిక
- 11న ఇచ్చిన తీర్పును సవరించిన న్యాయస్థానం
- గ్రేటర్ వరంగల్ లోనూ అమలు చేయాలంటున్న జనం

వీధి కుక్కల బెడదకు సంబంధించి సుప్రీంకోర్టు శుక్రవారం కీలక ఆదేశాలు జారీ చేసింది. వీధులు, బహిరంగ ప్రదేశాల్లో వీటికి ఆహారం అందించడం చట్టవిరుద్ధమని స్పష్టం చేసింది. వీధి కుక్కలకు నిర్దేశిత ప్రాంతాల్లోనే ఆహారం అందించాలని, ఇందుకోసం అధికారులు ప్రతి వార్డులో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయాలంటూ ఆదేశించింది. ఆయా ప్రాంతాల్లో మాత్రమే కుక్కలకు ఆహారం అందించాలని సూచిస్తూ నోటీసు బోర్డులు ఏర్పాటు చేయాలని వెల్లడించింది. దీనిని ధిక్కరిస్తే చర్యలు తప్పవంటూ హెచ్చరించింది. అయితే సుప్రీం ఆదేశాలు కేవలం ఢిల్లీ వరకే పరిమితం కాకుండా దేశ వ్యాప్తంగా అమలు చేయాలన్న డిమాండ్ పెరుగుతోంది. గ్రేటర్ వరంగల్ పరిధిలో కూడా కుక్కల బెడద తీవ్రంగా ఉందంటున్నారు. కుక్కల అరుపులతో కంటి మీద కునుకు లేకుండా పోతోందంటున్నారు. రాత్రి వేళల్లో తలుపు తీసి బయట అడుగు పెట్టాలంటేనే భయంతో వణికి చస్తున్నారు. కుక్క కాటుకు గురై ఇప్పటికే పలువురు ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. బల్దియా పరిధిలో కుక్కలు పట్టుకునేందుకు ప్రత్యేక విభాగం ఉన్నప్పటికీ వారి పనితీరు ఆశాజనకంగా లేదంటున్నారు. గ్రేటర్ అధికారులు, పాలకులు స్పందించిన మహా నగరంలో కూడా సుప్రీం కోర్టు ఆదేశాలను అమలు చేయాలని కోరుతున్నారు. అప్పుడే ప్రజల ప్రాణాలకు రక్షణ దొరుకుతుందంటున్నారు. - వరంగల్ వాయిస్ ప్రతినిధి



## విద్యా ప్రమాణాలు బాగుండాలి

- హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్
- అంగన్వాడి కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు



8లో..



8లో..

## సర్వీస్ రోడ్డు పూర్తి చేయాలి

- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి వినతి

## అవగాహన లేక అరెస్టులు

- తెల్లవారు జామున 3 గంటలకే స్టేషన్ కు తరలింపు
- బీజేపీ జిల్లా కోశాధికారి కూచన క్రాంతి కుమార్

2లో..



# ఆహారం పెట్టొద్దు

- **బహిరంగ ప్రదేశాల్లో నిషేధం**
- **వీధికుక్కల బెడదపై సుప్రీం కీలక ఆదేశాలు**
- **ధిక్కరిస్తే చర్యలు అంటూ హెచ్చరిక**
- **11న ఇచ్చిన తీర్పును సవరించిన న్యాయస్థానం**
- **గ్రేటర్ వరంగల్ లోనూ అమలు చేయాలంటున్న జనం**



**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** వీధి కుక్కల బెడదను తగ్గించడమే లక్ష్యంగా సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఎట్టి పరిస్థితుల్లో వీధుల్లో కుక్కలకు ఆహారం ఇవ్వకూడదంటూ ఆదేశించింది. ఈ ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని సుప్రీంకోర్టు హెచ్చరించింది. నియంత్రణ లేకుండా ఆహారం ఇవ్వడం వల్ల అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుంటున్నాయని వచ్చిన నివేదికలను పరిగణనలోకి తీసుకొని ఈ ఆదేశాలు జారీ చేస్తున్నట్లు చెప్పింది. సామాన్య పౌరులు వీధుల్లో నడిచేటప్పుడు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇటువంటి పద్ధతికి స్వస్తి పలకాలని అభిప్రాయపడింది.

**తీర్పును సవరించిన సుప్రీం..**

వీధి కుక్కల దాడులు పెరిగిపోవడంపై ఆందోళన వ్యక్తం చేసిన ద్విసభ్య ధర్మాసనం ఢిల్లీలో అవి ఎక్కడా కనిపించ డానికి వీల్లేదని, వీటిని షెల్టర్లకు తరలించాలంటూ ఆగస్టు 11న తీర్పు ఇచ్చింది. ఈ ఆదేశాలపై జంతు ప్రేమికులు తీవ్ర అభ్యంతరాలు, నిరసనలు వ్యక్తం చేసిన నేపథ్యంలో జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి. అంజరియాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా రేబిస్ లక్షణాలు లేదా విపరీత ప్రవర్తన కలిగిన కుక్కలు మినహా ఇప్పటివరకు షెల్టర్లకు తరలించిన వాటిని విడుదల చేయాలని ఆదేశించింది. వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ చేసిన తర్వాత వాటిని ఎక్కడ నుంచి తీసుకొచ్చారో అక్కడే విడిచిపెట్టాలని పేర్కొంది. ఇందుకు సంబంధించి ఆగస్టు 11న ఇచ్చిన తీర్పును సవరించిన న్యాయస్థానం.. తదుపరి విచారణ ఎనిమిది వారాలకు వాయిదా వేసింది.

**గ్రేటర్ లోనూ కుక్కల బెడగ..**

వరంగల్ మహా నగరంతోపాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. కుక్కల భారిన పడి ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. రాత్రి వేళల్లో గుంపులు గుంపులుగా తిరిగుతూ దారిన పోయేవారి వెంట పడుతున్నాయి. వాటిని తప్పించుకొని పోవడం పెద్ద టాస్క్ గా మారుతోంది. కుక్కల అరుపులకు కంటి మీద కునులేని రాత్రులు గడపాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. రాత్రి పూట ఒకటికి, రెండుకు బయటకు రావాలంటేనే వనుకు పుడుతోంది. నిత్యం వాహనాలపై ప్రయాణించే వారి వెంట పడుతూ భయ భ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఇటీవలి కాలంలో రేబిస్ వ్యాక్సిన్ వికటించి భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మంజూర్ నగర్ కు చెందిన గరిసెల రజిత (37) మృతి చెందిన అందరికీ తెలిసిందే. ఇలాంటి పరిస్థితిలో ఢిల్లీలో మాదిరిగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోనూ అమలు చేయాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.

**ఆశించిన ఫలితాలు లేవు..**

గ్రేటర్ వరంగల్ పరిధిలో కుక్కలను పట్టేందుకు ప్రత్యేక వ్యవస్థ ఉన్నప్పటికీ అది ఆశించిన మేర ఫలితాలను ఇవ్వడం లేదు. కుక్కలను పట్టేందుకు తెల్లారిన తర్వాత తీరిగ్గా 9 గంటలకు వీధుల్లోకి రావడంతో అప్పటికే కుక్కలన్నీ తమ డెన్ లోకి చేరుకొని విశ్రాంతి తీసుకుంటున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు కుక్కలు పట్టేందుకు వాహనం రాగానే కుక్కలన్నీ పరార్ అవుతున్నాయి. దీంతో వారికి ఒక్క కూడా దొరకడం లేదు. వాహనం అటు వెళ్లగానే తిరిగి కుక్కలు వీర విహారం చేస్తున్నాయి. అయితే కుక్కలకు పట్టేందుకు, వాటికి స్టెర్లింగ్ చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయాలంటున్నారు. తూతు మంత్రంగా వ్యవహరిస్తే ఆశించిన ఫలితాలు రావంటున్నారు.



## సమర్ధవంతంగా విధులు నిర్వర్తించాలి

**వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్**

**వరంగల్ వాయిస్, క్రైం :** పోలీస్ అధికారులకు అప్పగించిన విధులను సమర్ధవంతంగా నిర్వహించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. హెడ్ కానిస్టేబుల్స్ రమేష్, కుమారస్వామి ఏఎస్ఐలుగా పదోన్నతి పొందిన సందర్భంగా శుక్రవారం కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. అనంతరం పోలీస్ కమిషనర్ తన చేతుల మీదుగా పదోన్నతి పొందిన అధికారుల భుజాలపై నక్షత్ర చిహ్నాలను అలంకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నమ్మకానికి తగ్గట్లుగా పనిచేసి వారి అభిమానాన్ని పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీసీఆర్బీ ఏసీపీ డేవిడ్ రాజు, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## గ్రామాల సమగ్రాభివృద్ధికి కృషి

- **కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**
- **వర్ధన్నపేటలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన**



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించి గ్రామాలు అభివృద్ధి దిశగా ముందుకు సాగేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పనుల జాతర – 2025 కార్యక్రమాన్ని చేపట్టిందని వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తెలిపారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండల పరిధిలోని దివిటిపల్లి గ్రామంలో శుక్రవారం ఎంజీఎన్ఆర్ఈజీస్ కింద రూ.12 లక్షల వ్యయంతో నూతన అంగనవాడి భవన నిర్మాణానికి, రూ.20 లక్షల నిధులతో నిర్మించే కడారిగూడెం గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు వారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంజీఎన్ఆర్ఈజీస్ ఉపాధి హామీ కూలీల లబ్ధిదారులకు పశువుల కొట్టం, మామిడి తోట పెంపకపు మంజూరు పత్రాలను ఎమ్మెల్యే నాగరాజు, జిల్లా కలెక్టర్ సత్య శారద అందజేశారు. తదనంతరం వన మహోత్సవంలో భాగంగా స్కూల్ ఆవరణలో వారు మొక్కలను నాటారు. అనంతరం ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ ప్రైవేట్ స్కూళ్లకు ధీటుగా అంగన్వాడి స్కూల్ లను అందుబాటులోకి తీసుకొని వచ్చి పిల్లలు వస్తువులు, రంగులు గుర్తుకు పట్టే విధంగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అలాగే ఊర్లో పిల్లలను అంగన్వాడిలో వదలి వారి పనులకు వెళ్తారు కావున అంగన్వాడి వర్కర్ పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని తెలిపారు. ఈ నూతన అంగన్వాడి భవన నిర్మాణానికి మనమే నిర్మాణం చేసుకుందాం అన్నారు. గ్రామస్తులు ఎవరు పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపవద్దన్నారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాక సుమారు 18 నెల్ల కాలంలో విద్యార్థుల కోసం 200 కోట్ల రూపాయలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ తీసుకొని రావడం జరిగింది. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డి గారికి కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ గ్రామానికి 12 ఇందిరమ్మ ఇళ్లలను కేటాయించడం జరిగింది అన్నారు. అందులో సుమారు ఇప్పటికి 9 ఇండ్లు నిర్మాణ పూర్తి చేసుకుని విధంగా ఉన్నాయిన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గానికి 3500 ఇండ్లు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించగా నాది దళిత నియోజకవర్గం నాకు ఇంకో 1500 ఇండ్ల కేటాయించామని సీఎం రేవంత్ రెడ్డి గారిని, మంత్రి పొంగులేటి రెడ్డి గారి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు..

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ గ్రామీణ ప్రజల భాగస్వామ్యంతో చేపడుతున్న అభివృద్ధి పనులు మరింత పారదర్శకంగా ఉండేలా అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకంలో ఎక్కువ రోజులు పని చేసిన కుటుంబాలకు, నిబద్ధతతో పని చేసిన వర్కర్లు పారిశుద్ధ్య కార్మికులకు కలెక్టర్, ఎమ్మెల్యే లు సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎమ్మెల్యే ఆధ్వర్యంలో యూరియాకు బదులుగా నానో యూరియా లిక్విడ్ డ్రోన్ తో స్ప్రే చేసే విధానంపై వ్యవసాయ శాఖ రైతులకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో రామిరెడ్డి, డిడబ్ల్యు ఓ రాజమణి, పంచాయితీ ఈఈ ఇజ్జగిరి, వర్ధన్నపేట ఏఎంసీ ఛైర్మన్ నరకుడు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## అవగాహన లేక అరెస్టులు

- **తెల్లవారు జామున 3 గంటలకే స్టేషన్ కు తరలింపు**
- **బీజేపీ జిల్లా కోశాధికారి కూచన క్రాంతి కుమార్**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఎలాంటి అవగాహన లేకుండా ముందస్తు అరెస్టుల పేరిట బీజేపీ నాయకులను పోలీస్ స్టేషన్ తరలించడాన్ని బీజేపీ జిల్లా కోశాధికారి కూచన క్రాంతి కుమార్ ఖండించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి పిలుపు మేరకు శుక్రవారం చలో సెక్రటేరియట్ నిర్వహించనున్నారన్న సమాచారం మేరకు నగరంలోని పలువురు బీజేపీ నాయకులను తెల్లవారు జామున 3 గంటలకే అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్లకు తరలించడాన్ని తప్పు పట్టారు. ఎలాంటి కార్యక్రమానికి పార్టీ పిలుపునివ్వక పోయినా అవగాహన లేకుండా అరెస్ట్ చేశారని ఆరోపించారు. కూచన క్రాంతి కుమార్ తోపాటు జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ రతన్ నోముల, కాశిబుగ్గ మండల అధ్యక్షులు అపురూప రజినీష్ నేతను అరెస్ట్ చేసి ఇంతెజార్ గంజ్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఉదయం ఆరు దాటిన తర్వాత వ్యక్తి గత పూచి కత్తుపై వారిని విడుదల చేశారు. ఈ సందర్భంగా కూచన క్రాంతి కుమార్ మాట్లాడుతూ ఈ అరెస్టులు కాంగ్రెస్ ప్రభుత్వ అరాచకాపాలనకు నిదర్శనం అన్నారు. ఇలాంటి కేసులు ఎన్ని పెట్టినా, బీజేపీ నాయకులు వెనక్కి తగ్గరన్నారు. అవినీతి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దెదించేవరకు మా పోరాటం ఆగదన్నారు.

వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
శుక్రవారం, ఆగస్టు 22, 2025

# శాయంపేటలో అభివృద్ధి పనుల జాతర

◆ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



**వరంగల్ వాయిస్, శాయంపేట :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'పనుల జాతర' కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా శాయంపేట మండలంలో శుక్రవారం నిర్వహించిన పనుల జాతరలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే సత్యనారాయణరావు మండలంలోని ఎంజేపీ బాలుర పాఠశాలలో రూ. 20 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అనంతరం, వనమహోత్సవంలో పాల్గొని మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా పత్తిపాక గ్రామానికి చెందిన ఎంజేపీ స్కూల్ విద్యార్థి జగన్ (8వ తరగతి) తాను తయారుచేసిన హ్యాండ్ క్రాఫ్ట్‌ను ఎమ్మెల్యేకు బహూకరించాడు. అలాగే, గ్రామ పంచాయతీ ఆవరణలో స్వచ్ఛ భారత్ మిషన్ నిధులు రూ.3 లక్షలతో నిర్మించనున్న కమ్యూనిటీ టాయిలెట్స్ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పల్లెల సమగ్రాభివృద్ధే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో గ్రామాలు నిర్వీర్యమయ్యాయని, నిధులు కేటాయించడంలో వివక్ష చూపడం వల్ల గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, ప్రజా ప్రభుత్వం ప్రతి గ్రామానికి ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతోందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, ఎంపీడీవో, మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, అధికార ప్రతినిధి చిందం రవి, వైస్ చైర్మన్ మారేపల్లి రవీందర్, మాజీ జడ్పీటీసీ చల్లా చక్రపాణి, భాషని మార్కండేయ, రవి శాంత, వరదరాజు, కట్టయ్య, రైపాల్, మాజీ సర్పంచ్ చిట్టి రెడ్డి రాజిరెడ్డి, ఎండీ వలి హైదర్, మాజీ ఎంపీటీసీ గజ్జి ఐలయ్య పాల్గొన్నారు.

# శివనామ స్మరణతో మార్మోగిన కోటగుళ్లు



**వరంగల్ వాయిస్, గణపురం :** కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం (కోటగుళ్లు)లో శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ రోజు అమావాస్య పర్వదినం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. కోటగుళ్లు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం గోశాలలోని గోమాతలకు ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు గణపతి పూజతో కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో మార్మోగింది. ప్రతి సంవత్సరం శ్రావణమాసం చివరి శుక్రవారం గణపేశ్వరునికి, భవానీ మాతకు నిజామాబాద్ సీపీ పోతరాజు సాయి చైతన్య, కీర్తి దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది కూడా వారు సమర్పించిన పట్టు వస్త్రాలను అమ్మవారికి అలంకరించారు. ఈ దంపతులకు కోటగుళ్లు పరిరక్షణ కమిటీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. ఈ పర్వదినం సందర్భంగా నందీశ్వరునికి, గణపేశ్వరునికి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం పూలమాలలతో, పట్టు వస్త్రాలతో స్వామివారిని, అమ్మవారిని అలంకరించారు. పూజల అనంతరం ఆలయ అర్చకులు భక్తులకు ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలు, మహిళలకు అమ్మవారి గాజులు అందజేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

# సమస్యలు వెంటనే పరిష్కరించాలి



**వరంగల్ వాయిస్, జనగామ :** పట్టణంలోని కలెక్టరేట్, బస్టాండ్‌కు సమీపంలో ఉన్న మూడో వార్డు సమస్యలకు నిలయంగా మారిందని, తక్షణమే అంతర్గత రోడ్లు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బూడిద గోపి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన అదనపు కలెక్టర్, మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ పింకేష్ కుమార్‌కు మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ మూడో వార్డులో మధ్యతరగతి ప్రజలు, చిన్న వ్యాపారులు, ఉద్యోగస్తులు నివసిస్తున్నారని తెలిపారు. పైకి చూస్తే పెద్ద పెద్ద భవనాలు, అభివృద్ధి చెందినట్లు కనిపించినా, లోపల పరిస్థితులు దారుణంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బాలాజీ నగర్, జ్యోతి నగర్, ఎల్లమ్మ గుడి ఏరియా, సెయింట్ మేరీస్ స్కూలు ఏరియా, కోటి రత్న హాస్పిటల్ వెనుక వైపు అంతర్గత సీసీ రోడ్లు లేక వర్షాకాలంలో వీధులన్నీ బురదమయంగా మారి చెరువులను తలపిస్తున్నాయని వివరించారు. దీని వల్ల స్కూలుకు వెళ్లే పిల్లలు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. 15 ఏళ్ల క్రితం వేసిన కొన్ని సీసీ మోరీలు శిథిలమైపోయి, కుంగిపోయాయని గోపి తెలిపారు. డ్రైనేజీ వాటర్ నిండిపోయి దుర్గంధం వెదజల్లుతోందని, దోమలు విపరీతంగా పెరిగి ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బాలాజీ నగర్ పిండి గిర్ని వద్ద ఉన్న కల్వర్టు శిథిలమై ప్రమాదకరంగా మారిందని, తక్షణమే కొత్త సీసీ స్లాబ్ వేయాలని డిమాండ్ చేశారు. అలాగే, నూతనంగా నిర్మిస్తున్న పెద్ద డ్రైనేజీ పనులను వేగవంతం చేసి వరద నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోపి వెంట గాజుల నాగరాజు, గుండు శ్రీనివాస్, అంజలి తదితరులు పాల్గొన్నారు.

# మద్యం టెండర్లలో గౌడ్స్ కు 25 శాతం వాటా కల్పించాలి

■ డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్




**వరంగల్ వాయిస్, హనుమకొండ:** కాంగ్రెస్ ప్రభుత్వం కామారెడ్డిలో బీసీలకు ఇచ్చిన డిక్లరేషన్ హామీలను అమలు చేయడంలో విఫలమైందని, ముఖ్యంగా గౌడ సామాజిక వర్గానికి ఇచ్చిన వాగ్దానాలను విస్మరించిందని తెలంగాణ జాగృతి ఆరోపించింది. ఈ మేరకు తెలంగాణ జాగృతి రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీకాంత్ గౌడ్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన 42 శాతం రిజర్వేషన్లు తమ పరిధిలో లేవని, కోర్టులు లేదా కేంద్ర ప్రభుత్వం పరిధిలో ఉన్నాయని తప్పించుకుంటున్నారని శ్రీకాంత్ గౌడ్ అన్నారు. అయితే, తమ పరిధిలో ఉన్న అంశం అయినప్పటికీ, గౌడ్స్‌కు కామారెడ్డి డిక్లరేషన్‌లో హామీ ఇచ్చిన 25 శాతం మద్యం టెండర్ల వాటాను ఎందుకు కల్పించడం లేదని ఆయన ప్రశ్నించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన 15 శాతం వాటాను మాత్రమే అమలు చేయడం తీవ్రంగా ఖండనీయమని ఆయన పేర్కొన్నారు. ప్రమాదవశాత్తు మరణించిన గౌడ్స్‌కు ఇస్తానన్న రూ. 10 లక్షల ఎక్స్ గ్రేషియా ఎక్కడ ఇచ్చారో సమాధానం చెప్పాలని శ్రీకాంత్ గౌడ్ డిమాండ్ చేశారు. అలాగే, ప్రతి గ్రామ పంచాయతీలో గౌడ్స్‌కు ఐదు ఎకరాల స్థలం కేటాయించి ఈత, తాటి వనాలను పెంచుతామన్న హామీ ఏమైందని రేవంత్ ప్రభుత్వాన్ని నిలదీశారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు తక్షణమే 25 శాతం మద్యం టెండర్ల వాటాను ప్రకటించకపోతే మద్యం టెండర్లను అడ్డుకుంటామని శ్రీకాంత్ గౌడ్ హెచ్చరించారు. అలాగే, పెంచిన రూ. 3 లక్షలను యథావిధిగా రూ. 2 లక్షలకు తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. గౌడ సమాజం ఈ నయవంచక కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని, రానున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఉప్పు పాతర వేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# కాంగ్రెస్ లో చేరిన బీఆర్ఎస్ నాయకులు



**వరంగల్ వాయిస్, హుజూరాబాద్ :** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. జమ్మికుంట మండలంలోని తనుగుల, బిజిగిరి షరీఫ్ గ్రామాల పరిధిలోని పలువురు కీలక నాయకులు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి హుజూరాబాద్ ఇంచార్జి ప్రణవ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తనుగుల పాక్స్ చైర్మన్ పోల్సాని వెంకటేశ్వర్ రావు, బిజిగిరి షరీఫ్ గ్రామ తాజా మాజీ సర్పంచ్ కటంగురి యుగంధర్ రెడ్డిలు కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం 18 నెలల్లోనే అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేదలకు అండగా నిలిచిందని ప్రశంసించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సొసైటీలకు రెండు సార్లు కొనసాగింపు ఇచ్చినందుకు ప్రభుత్వానికి, అలాగే హుజూరాబాద్ ఇంచార్జిగా ఉన్న ప్రణవ్‌కు వారు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో హుజూరాబాద్ నియోజకవర్గ అభివృద్ధి ప్రణవ్‌తోనే సాధ్యమని, అందుకు తాము తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ధనమైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఖిలా వరంగల్ మెట్లభావి వద్ద కొలువై ఉన్న ధన మైసమ్మ ఆలయంలో శ్రావణ మాసం చివరి శుక్రవారం పురస్కరించుకుని స్థానిక మహిళలు కుంకుమ పూజలు చేశారు. ఈ సందర్భంగా వడ్డే కళావతి కుటుంబంతో కలిసి అమ్మవారి చిత్ర పటాన్ని ఆలయానికి బహుకరించారు. అనంతరం ఆలయ పూజారి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి తీర్థ ప్రసాధాలు అందించారు. శ్రావణమాసం పురస్కరించుకొని భక్తులు స్థానిక మహిళలు భక్తి శ్రద్ధలతో పూజలు చేసిన ప్రతీ ఒక్క కుటుంబాన్ని అమ్మవారు ఆశీర్వాదించాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో తోట సంధ్య, వడ్డె కళావతి, వడ్డె శ్రీమాన్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



**వరంగల్ వాయిస్, నడికూడ :** ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా నాణ్యమైన విద్య అందుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) కునుసోతు హనుమంతరావు అన్నారు. మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, చౌటుపర్తి (నడికూడ)లో శుక్రవారం జరిగిన ఒక సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోడెం రాజేందర్ బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఈఓ హనుమంతరావు విద్యార్థులకు టై, బెల్ట్, ఐడీ కార్డులు, డైరీలను పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మంచి నైపుణ్యంతో బోధించే ఉపాధ్యాయులు ఉన్నారని, కాబట్టి గ్రామంలోని తల్లిదండ్రులు అందరూ కలిసి పాఠశాలలో విద్యార్థుల నమోదును పెంచడానికి కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ గూడెం రమ్య, పాఠశాల ఉపాధ్యాయులు ఆర్.సదానందం, ఎం.రామయ్య, ఎన్.జగదీశ్వర్, జి.నాగరాజు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



**వరంగల్ వాయిస్, జనగామ:** ప్రజల ప్రాణాలు కాపాడాలనే ఉద్దేశంతో లయన్స్ క్లబ్ ఆఫ్ జనగామ మిలీనియం ఆధ్వర్యంలో శుక్రవారం స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరం జనగామ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని బ్లడ్ బ్యాంకులో జరిగింది. క్లబ్ అధ్యక్షుడు బండ భిక్షపతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మొత్తం 7 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. జోన్ ఛైర్మన్ లయన్ బైరు వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఒకరు చేసే రక్తదానం ముగ్గురి ప్రాణాలను కాపాడగలదని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. రక్తదానం చేయడం వల్ల కేవలం గ్రహీతకే కాకుండా, దాతకు కూడా ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని వెంకటేశ్వర్లు వివరించారు. రక్తదానం చేయడం ద్వారా శరీరంలో కేలరీలు తగ్గుతాయని, అలాగే కొలెస్ట్రాల్ స్థాయిలు మెరుగుపడతాయని ఆయన పేర్కొన్నారు. ఈ రక్తదాన శిబిరం లయన్స్ క్లబ్ సభ్యుడు సురారం రాజు కుమారుడు దనిష్క పుట్టినరోజును పురస్కరించుకుని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సురారం రాజు, వెర్రి వేణుగోపాల్ రెడ్డి, బబ్బూరి సంతోష్, గుండె సుమన్ రాజ్, దామోదర్ రెడ్డి, కృష్ణారెడ్డి, రమేష్ తదితరులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ రీజియన్ చైర్మన్లు ఏనుగు నర్సిరెడ్డి, శ్రీరామ్ శ్రీనివాస్, డాక్టర్ మోర్తాల దివ్య, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ కనకదుర్గ దేవాలయంలో పూజలు



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** వరంగల్ రైల్వే గేట్ ఆవలి ప్రాంతంలోని కరీమాబాద్ సిరంగి రాజారాం తోటలో ఉన్న శ్రీ కనకదుర్గ దేవస్థానంలో శ్రావణమాసం పురస్కరించుకొని శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజల్లో డాక్టర్ ఏ. రాజేంద్రప్రసాద్ భారతి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఏ. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ తమ ఇంటి కులదైవమైన కనకదుర్గ అమ్మవారికి ప్రతి సంవత్సరం శ్రావణమాసంలో విశేష పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. ఈ ఏడాది కూడా అమ్మవారికి ఒడిబియ్యం, చీరలు, బట్టలు సమర్పించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆంజనేయ శర్మ మాట్లాడుతూ కనకదుర్గ అమ్మవారు అత్యంత శక్తివంతమైన దేవత అని, కోరిన కోరికలు నెరవేరుస్తూ భక్తులందరినీ చల్లగా కాపాడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజేంద్రప్రసాద్ దంపతులతో పాటు ఆంజనేయ శర్మ, లకంరాజు, శంకర్, ప్రసూన, రజిత, మానస తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి పోటీలకు జాగృతి విద్యార్థిని ఎంపిక



**వరంగల్ వాయిస్, వరంగల్:** కొమురం భీం జిల్లాలోని గోలేటి టౌన్‌షిప్‌లో ఈనెల 23న జరగనున్న 71వ సీనియర్ రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ మహిళల ఛాంపియన్‌షిప్‌కు జాగృతి మహిళల డిగ్రీ కళాశాల విద్యార్థిని మ్యాదరబోయిన శ్రీజ ఎంపికయ్యారు. బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్న శ్రీజ ప్రతిభకు కళాశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ ఎల్ది మహేందర్, డైరెక్టర్లు ఎల్ది రవీందర్, దావు శ్రీనివాస్ రెడ్డి, ఏ. సునీల్, ఎల్ది రాజు, ప్రిన్సిపాల్ ఎల్. ఉమాపతిరావు, ఫిజికల్ డైరెక్టర్ శ్రీధర్ల కుమారస్వామి, అధ్యాపకులు ఏ. చిరంజీవి, చిట్యాల నరేష్, హెచ్. శ్రీకాంత్, జి. వీరాచారి, ఏ. కృష్ణ, మంజుల, విద్యార్థిని శ్రీజను అభినందించారు. రాష్ట్రస్థాయిలో విజయం సాధించాలని ఆకాంక్షించారు.

# గ్రామాల అభివృద్ధే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

◆ ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



**వరంగల్ వాయిస్, నడికూడ:** గ్రామాలలో మౌలిక వసతులు కల్పించడం ద్వారా సమగ్రాభివృద్ధి సాధించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'పనుల జాతర 2025' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నడికూడ మండలంలో పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించి, మరికొన్నింటికి శంకుస్థాపన చేశారు. కంఠాత్మకూర్ గ్రామంలో అంగన్వాడీ భవనానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే, ఉన్నత పాఠశాలలో సైన్స్ ల్యాబ్‌కు భూమి పూజ చేశారు. అలాగే, పల్లె దవాఖానను, క్యాటిల్ షెడ్ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం రాయపర్తి గ్రామంలో నూతనంగా నిర్మించిన అంగన్వాడీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. గత ప్రభుత్వంలో అభివృద్ధి పనులు కేవలం శిలాఫలకాలకే పరిమితమయ్యాయని, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వంలో అభివృద్ధి ముసుగులో దోచుకుతిన్నారని ఆరోపించారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పరకాల నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుపోవడం తన ధ్యేయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి నవీన్, తహసీల్దార్ రాణి, ఎంపీడీవో జి.విమల, పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, నడికూడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్, మండల సమన్వయ కమిటీ సభ్యులు పర్నెం మల్లారెడ్డి, తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్‌లో బుద్ధ విహార్ నిర్మాణం చేపట్టాలి

## మంత్రి కొండా సురేఖకు వినతిపత్రం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** జిల్లాలో బుద్ధ విహార్ నిర్మాణం చేపట్టాలని కోరుతూ భారతీయ బౌద్ధ మహాసభ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ బొమ్మల్ల అంబేద్కర్, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మురళీధర్ రావుకు వినతిపత్రం సమర్పించారు. బౌద్ధం మానవాళికి శరణ్యమని, ఉమ్మడి వరంగల్ జిల్లాలో బౌద్ధం రోజురోజుకు విస్తరిస్తోందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఈ సందర్భంగా బొమ్మల అంబేద్కర్ మాట్లాడుతూ ఉపాసక బొమ్మల కట్టయ్య ఉమ్మడి వరంగల్ జిల్లాలో భారతీయ బౌద్ధ మహాసభ వ్యాప్తికి, బుద్ధ విహార్ నిర్మాణం కోసం ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. జిల్లాలో ఎంతోమంది బౌద్ధులు ఉన్నారని, వీరందరికీ బుద్ధ వందనం చేసుకునేందుకు ఒక విహార్ అవసరం ఎంతైనా ఉందని ఆయన పేర్కొన్నారు. మంత్రి కొండా సురేఖ, మురళీధర్ రావు సమక్షంలో వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద (ఐఏఎస్), వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గుండు సుధారాణిలకు కూడా బుద్ధ విహార్ నిర్మాణం కోసం సహకరించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. దీనికి అధికారులు సానుకూలంగా స్పందించారని, వీలైనంత త్వరలో బుద్ధ విహార్ నిర్మాణం కోసం సహకరిస్తామని హామీ ఇచ్చారని అంబేద్కర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బొమ్మల అంబేద్కర్ తో పాటు పలువురు బీఎస్ఐ నాయకులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**వరంగల్ వాయిస్, పరకాల:** గ్రామాలలో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని, మౌలిక వసతులు కల్పించడమే తమ లక్ష్యమని పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన పరకాల మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి, విద్యార్థులకు బ్యాగులు, బూట్లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి నాగారం గ్రామంలో అంగన్‌వాడీ భవనానికి, అలియాబాద్ గ్రామంలో గ్రామ పంచాయతీ భవనానికి, పోచారం గ్రామంలో అంగన్‌వాడీ భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బ్యాగులు, బూట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పరకాల నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే తన ప్రధాన ధ్యేయమని తెలిపారు. గత ప్రభుత్వాలు కేవలం శిలాఫలకాలకే పరిమితమయ్యాయని, కానీ తమ కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో అభివృద్ధి పేరుతో దోచుకున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పెద్ది ఆంజనేయులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, మండల అధ్యక్షుడు దేవేందర్ రెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# నూతన జాతీయ విద్యా విధానం అమలు చేయొద్దు



**వరంగల్ వాయిస్, వరంగల్:** కేంద్ర ప్రభుత్వ ఒత్తిళ్లకు తలొగ్గి తెలంగాణలో నూతన జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ- 2020) అమలు చేయాలనే ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ (ఏఐఎస్ బీ) రాష్ట్ర కన్వీనర్ హకీమ్ నవీద్ డిమాండ్ చేశారు. పెద్దపల్లి జిల్లాలో జరిగిన ఏఐఎస్ బీ ప్రథమ మహాసభలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. జిల్లా కన్వీనర్ రామచందర్ అధ్యక్షతన జరిగిన ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన హకీమ్ నవీద్ మాట్లాడుతూ, విద్యా రంగాన్ని కార్పొరేటీకరణ, కేంద్రీకరణ, వ్యాపారీకరణ చేసే చర్యల్లో భాగంగానే కేంద్ర ప్రభుత్వం ఎన్ఈపీ-2020ని రూపొందించిందని ఆరోపించారు. దేశంలో కేరళ, తమిళనాడు, కర్ణాటక వంటి రాష్ట్రాలు ఈ విధానానికి వ్యతిరేకంగా తమ నిర్ణయాన్ని బహిరంగంగా ప్రకటించాయని ఆయన గుర్తు చేశారు. అయితే, తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సైద్ధాంతికంగా పోరాడకుండా, ఎన్ఈపీ-2020 అమలుకు తలొగ్గుతోందని ఆయన విమర్శించారు. తెలంగాణలో ఈ విధానం అమలైతే విద్యారంగం పూర్తిగా కేంద్రీకృతం, కార్పొరేటీకరణ, వ్యాపారీకరణ అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం మాదిరిగా తెలంగాణ ప్రభుత్వం కూడా ఎన్ఈపీ-2020కి వ్యతిరేకంగా రాష్ట్రంలో దానిని అమలు చేయబోమని అధికారికంగా ప్రకటన చేయాలని, అసెంబ్లీలో తీర్మానం చేయాలని హకీమ్ నవీద్ డిమాండ్ చేశారు. ఈ మహాసభలో ఏఐఎస్ బీ నూతన పెద్దపల్లి జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా ఆరేపల్లి సురేష్, ప్రధాన కార్యదర్శిగా ఈర్ల రామచంద్ర ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ బీ రాష్ట్ర నాయకులు అతికం రాజశేఖర్ గౌడ్, ఎడపెల్లి వంశీ, నళిగంటి అరవింద్, ఈర్ల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# 'పనుల జాతర'తో గ్రామాల అభివృద్ధి

■ ములుగు కలెక్టర్ దివాకర టీఎస్



**వరంగల్ వాయిస్, ములుగు :** వివిధ అభివృద్ధి పనులను చేపట్టాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన కార్యక్రమం 'పనుల జాతర' అని ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. శుక్రవారం ఏటూరు నాగారం మండలం చిన్నబోయినపల్లి గ్రామ పంచాయతీలో జిల్లా అదనపు కలెక్టర్ సంపత్ రావుతో కలిసి ఆయన 'పనుల జాతర' కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద మొత్తం 266 పనులు చేపట్టబడుతున్నాయని, గ్రామ ప్రజలు వాటిని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి కార్మికుడు రోజుకు రూ. 307 లబ్ధి పొందే అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. చిన్నబోయినపల్లిలో రైతులకు క్యాటిల్ షెడ్ నిర్మాణానికి శంకుస్థాపన, ఇంకుడు గుంతల నిర్మాణం, నీటి సంరక్షణ కార్యక్రమాలను ప్రారంభించారు. వ్యక్తిగత పనుల కింద పౌల్ట్రీ షెడ్లు, నాడెపు కంపోస్ట్ పిట్లు, అజోల్ల పెంపకం, ల్యాండ్ డెవలప్‌మెంట్, హార్టికల్చర్ ప్లాంటేషన్, టాయిలెట్ నిర్మాణాలు వంటి కార్యక్రమాలు చేపట్టాలని గ్రామస్తులకు సూచించారు. ప్రతి కుటుంబం తమ జాబ్ కార్డును ఉపయోగించుకొని ఉపాధి హామీ పథకం ద్వారా ఆర్థిక అభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. కొత్తగా పనులు కావాల్సిన వారికి సంబంధిత అధికారులు సహాయం అందిస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకంలో అత్యుత్తమంగా పనిచేసిన కార్మికులకు, పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కల పెంపకానికి సేవలు అందించిన వారికి, పారిశుధ్య కార్యక్రమాల్లో పాల్గొన్న దివ్యాంగులకు కలెక్టర్ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ, ఏపీఓ, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం



**వరంగల్ వాయిస్, నడికూడ:** నూతనంగా ప్రారంభమైన ఆరోగ్య ఉపకేంద్రం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యమని పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. ఈ నేపథ్యంలో, హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య ఆదేశాల మేరకు శుక్రవారం పిహెచ్‌సి రాయపర్తి సిబ్బంది నడికూడ మండలం కంఠాత్మకూర్ గ్రామంలో విస్తృత స్థాయిలో డోర్–టు–డోర్ ఫీవర్ సర్వే నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి స్వయంగా ఈ సర్వేను పర్యవేక్షించారు. ఆయన గ్రామాల్లోని కొన్ని ఇళ్లను సందర్శించి ప్రజలతో మాట్లాడారు. డెంగీ జ్వరం రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డెంగీ వర్షాకాలంలో ఏడిస్ దోమ కాటు ద్వారా వ్యాప్తి చెందే ప్రమాదకరమైన వ్యాధి అని, ఈ దోమలు ఉదయం, మధ్యాహ్నం ఎక్కువగా కుడతాయని ఆయన తెలిపారు. డెంగీకి ప్రత్యేకమైన మందు లేనందున, నివారణే ప్రధాన మార్గమని ఆయన అన్నారు. ఇంటి చుట్టూ ఉండే పిచ్చి మొక్కలు, గడ్డి పొదలు, నీరు నిల్వ ఉండే ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ అప్పయ్య ప్రజలకు సూచించారు. ప్రతి మంగళవారం, శుక్రవారం 'డ్రై డే' నిర్వహించి కూలర్లు, డబ్బాలు, కొబ్బరి చిప్పలు, ట్యాంకులు, టైర్లు శుభ్రం చేయాలని, నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని అన్నారు. దీనివల్ల దోమలు వృద్ధి చెందకుండా నివారించవచ్చని తెలిపారు. పిల్లలు, పెద్దలు పూర్తి బట్టలు వేసుకోవాలని, దోమల నుంచి రక్షణ కోసం దోమ తెరలు, కాయిల్స్, లిక్విడ్‌లు, పూత మందులు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పీహెచ్‌సీ వైద్య అధికారిణి డాక్టర్ దివ్య, హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్లు, సూపర్ వైజర్లు, ఏఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

## క్యాన్సర్ రోగులకు తల వెంట్రుకలు దానం



**వరంగల్ వాయిస్, హసన్ పర్తి:** క్యాన్సర్ రోగుల కోసం విగ్గులు తయారు చేయడానికి హసన్ పర్తి శ్రీ సాయి జూనియర్ కళాశాల విద్యార్థిని కౌటం మేఘన తన తల వెంట్రుకలను దానం చేశారు. శుక్రవారం ఆమె కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జనగాం శివకుమార్‌కు వీటిని అందజేశారు. ఎంపీసీ గ్రూపు చదువుతున్న మేఘన మాట్లాడుతూ టీవీలో వచ్చిన ఒక కార్యక్రమం చూసి తాను ప్రేరణ పొందినట్లు తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఒక స్వచ్ఛంద సంస్థకు తన వెంట్రుకలను అందజేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. మేఘన చేసిన ఈ మంచి పనికి ప్రిన్సిపాల్ డాక్టర్ జనగాం శివకుమార్ ఆమెను అభినందించారు. మేఘనను శాలువాతో సత్కరించారు. అనంతరం, ఆమె వెంట్రుకలను కొరియర్ ద్వారా హైదరాబాద్‌లోని హెయిర్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థకు పంపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కేదాసి శ్రీ వెంకటేశ్వర కుమార్, వైస్ ప్రిన్సిపాల్ అనుమాండ్ల విద్యాసాగర్, ఇతర విద్యార్థినిలు పాల్గొన్నారు.

# విద్యారంగంపై ప్రభుత్వం నిర్లక్ష్యం

■ ఏఐఎఫ్‌డీఎస్ ఆగ్రహం



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 19 నెలలైనా విద్యారంగానికి ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య (ఏఐఎఫ్‌డీఎస్) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. హైదరాబాద్‌లోని బీఎన్ హాల్ బాగ్ లింగంపల్లిలో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. ఈ సమావేశం ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పల్లె మురళి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 2,253 ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం లేదని, 1,500కు పైగా పాఠశాలల్లో మరుగుదొడ్లు లేవని ఆందోళన వ్యక్తం చేశారు. 28 వేలకు పైగా పాఠశాలల్లో కంప్యూటర్లు అందుబాటులో లేవని, విద్యార్థులకు రెండు జతల యూనిఫామ్‌లు ఇవ్వాల్సిన ప్రభుత్వం ఒక జత మాత్రమే ఇచ్చిందని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో 11 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ, ప్రభుత్వం వాటిని భర్తీ చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని కాంగ్రెస్ అమలు చేయడం లేదని, మధ్యాహ్న భోజన పథకానికి నిధులు పెంచడం లేదని నాగార్జున ఆరోపించారు. లైబ్రరీలు, మరుగుదొడ్లు, ప్రహరీ గోడలు, అదనపు గదుల నిర్మాణాలకు నిధులు విడుదల చేయకపోవడంతో పాఠశాల విద్య తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని అన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల ఫీజు దోపిడీని అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందని, తక్షణమే ఫీజు నియంత్రణ కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. గురుకులాల్లో కనీస సౌకర్యాలు లేవని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 93 మంది విద్యార్థులు మరణించినా ప్రభుత్వం పరిష్కారం చూపలేదని నాగార్జున అన్నారు. అద్దె భవనాల్లో నడుస్తున్న 662 గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను వెంటనే విడుదల చేయాలని కోరారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం పరోక్షంగా ఎన్ఈపీ 2020ని అమలు చేస్తోందని, దీనిపై రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే భవిష్యత్తులో తీవ్ర ప్రతిఘటనలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గర్ల్స్ కన్వీనర్ మాస్ సావిత్రి, రాష్ట్ర సహాయ కార్యదర్శి మాలోతు జబ్బర్ నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండీ మోసిన్, వస్కుల భరత్, రాష్ట్ర కోశాధికారి పోతుగంటి కాశి, రాష్ట్ర కమిటీ సభ్యులు టి.కుమార్, ఇమ్మానియేల్ తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించుకోవాలి



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని రఘునాథపల్లి రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ (సీఐ) ఎడవెల్లి శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఉత్సవ కమిటీ సభ్యులు, వివిధ మతాల పెద్దలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గణేష్ మండపాల ఏర్పాటుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకొని తప్పనిసరిగా అనుమతి పొందాలని సూచించారు. పోలీస్ శాఖ ప్రత్యేకంగా రూపొందించిన యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే విగ్రహాలను ఏర్పాటు చేసుకోవడానికి అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. గణేష్ మండపాలలో వినాయక విగ్రహాలు ప్రతిష్టించిన తర్వాత, నవరాత్రులు పూర్తయి నిమజ్జనం చేసేటప్పుడు డీజేలను ఏర్పాటు చేయడానికి అనుమతి లేదని సీఐ తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో రఘునాథపల్లి సబ్ ఇన్స్పెక్టర్ నరేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## మండల ప్రత్యేక అధికారిగా రాధాకృష్ణ



**వరంగల్ వాయిస్, పరకాల:** పరకాల మండల ప్రత్యేక అధికారిగా డాక్టర్ వై. రాధాకృష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈ పదవిలో పనిచేసిన డాక్టర్ కె. విజయభాస్కర్ పెద్దపల్లి జిల్లా పశు వైద్య అధికారిగా పదోన్నతి పొందడంతో, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డాక్టర్ రాధాకృష్ణ ఈ నియామకం పొందారు. ఈ సందర్భంగా పరకాల ఎంపీడీవో పెద్ది ఆంజనేయులు నూతన అధికారిని సాదరంగా ఆహ్వానించి, శాలువాతో సత్కరించారు. అనంతరం డాక్టర్ రాధాకృష్ణ మాట్లాడుతూ, ఎంపీడీవో, ఇతర సిబ్బంది సహకారంతో పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ పర్యవేక్షకులు సీహెచ్. శైలశ్రీ, పంచాయతీ రాజ్ ఏఈఎన్ శ్రీలత, ఏపీఓ ఇందిర, ఈసీ రజనీకాంత్, ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆటో కార్మికుల హక్కులకై పోరాటం



**వరంగల్ వాయిస్, వరంగల్:** ఆటో కార్మికుల హక్కుల కోసం ఏఐసీటీయూ (ఆల్ ఇండియా సెంట్రల్ ట్రేడ్ యూనియన్) నిరంతరం పోరాటం చేస్తుందని ఏఐసీటీయూ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్కెర రామస్వామి అన్నారు. శుక్రవారం వరంగల్ ఎంజీఎం సెంటర్‌లో ఏఐసీటీయూ ఆధ్వర్యంలో ఎండీ మహబూబ్ పాషా నాయకత్వంలో ఆటో కార్మికులు నూతన బోర్డును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ముక్కెర రామస్వామి, ఉపాధ్యక్షుడు మాలోత్ సాగర్ మాట్లాడుతూ, రవాణా రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించడానికి బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, తక్షణమే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మహాలక్ష్మి పథకం ద్వారా నష్టపోతున్న ఆటో డ్రైవర్లకు నెలకు రూ. 4,500 పెన్షన్ ఇవ్వాలని, రూ. 10 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. అలాగే, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కూడా రవాణా కార్మికులకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 23న ఉదయం 10 గంటలకు వరంగల్ చార్ బౌలిలోని నోబుల్ ఫంక్షన్ హాల్‌లో జరగనున్న ఆటో, ట్రాలీ డ్రైవర్ల మొదటి మహాసభలో అధిక సంఖ్యలో పాల్గొని, కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్కే లతీఫ్, ఎస్కే దస్తగిరి, ఎంఏ సలాం, ఎస్. శ్రీను, ఎంఏ గఫూర్, ఎస్. రాజు, ఎస్‌డీ హుస్సేన్, యూసఫ్, కిన్నెర స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధికి పెద్దపీట

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**వరంగల్ వాయిస్, రేగొండ:** ప్రజా ప్రభుత్వ పాలనలో సంక్షేమం, అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం రేగొండ మండలంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆవరణలో అంగన్‌వాడీ కేంద్రం, ఇంకుడు గుంత నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మండలంలో సుమారు 305 అభివృద్ధి పనులను ప్రారంభించామని తెలిపారు. అనంతరం ఆయన వేణుగోపాలస్వామి ఆలయాన్ని సందర్శించి, ఆలయ ఆర్చ్ నిర్మాణాన్ని పరిశీలించి శిల్పుల పనితనాన్ని అభినందించారు. ఆలయ పనుల గురించి అడిగి తెలుసుకుని, దాత సీతారాంరెడ్డి చేస్తున్న కృషిని కొనియాడారు. వేణుగోపాలస్వామి ఆలయానికి సీసీ రోడ్డు నిర్మాణానికి అంచనా రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అలాగే, పోచమ్మ గుడిని సందర్శించి దాని పునర్నిర్మాణానికి రూ. 10 లక్షలు మంజూరు చేస్తున్నానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్వేత, ఎంపీడీవో వేంకటేశ్వర రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ కిష్టయ్య, ప్యాక్స్ చైర్మన్ విజ్ఞాన్ రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు నర్సయ్య, రేగొండ టౌన్ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, కిసాన్ సెల్ మండల అధ్యక్షులు ఎడ్ల మల్లారెడ్డి, సీనియర్ నాయకులు బాబురావు, పున్నం రవి, మేకల భిక్షపతి, శంకరయ్య, కోలేపాక సాంబయ్య, రఘు, రవీందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## సీఐ కరుణాకర్ రావుకు సత్కారం



**వరంగల్ వాయిస్, గణపురం:** గణపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ (సీఐ)గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన కరుణాకర్ రావును శుక్రవారం చెల్పూర్ కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు సీఐని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చెల్పూర్ ప్యాక్స్ వైస్ చైర్మన్ కావాటి రవీందర్, చెల్పూర్ మాజీ వార్డు మెంబర్ దారకొండ నాగరాజు, చెల్పూర్ కాంగ్రెస్ యూత్ అధ్యక్షులు చాగర్ల కళ్యాణ్, బీసీ సెల్ అధ్యక్షులు అడప రాజు, సీనియర్ నాయకులు రవీందర్, శ్రీకాంత్, వేముల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## అంటువ్యాధుల నివారణకు 'డ్రై డే'



**వరంగల్ వాయిస్, కరీమాబాద్:** వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున, ప్రభుత్వం చేపట్టిన 'డ్రై డే' కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. మలేరియా విభాగం హెల్త్ అసిస్టెంట్ పెండ్యాల బాబు ఆధ్వర్యంలో ఉప్పరోని కుంట, ముకుంద కాలనీ, మంకీ ఫుడ్ కోర్ట్ ప్రాంతాల్లో శుక్రవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మరుపల్ల రవి మాట్లాడుతూ ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు తమ పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా ఇళ్లంటింటికి స్టిక్కర్లు అంటించి, కరపత్రాలు పంపిణీ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. నీరు నిల్వ ఉన్న పెద్ద గుంతలలో ఆయిల్ బాల్స్‌ను వేసి దోమల ఉత్పత్తిని అరికట్టే ప్రయత్నం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు ఉల్లి నాగరాజు, కవిత ఉపేంద్ర, కలకోట్ల రమేష్, భాస్కర్, సుజాతలతో పాటు మలేరియా హెల్త్ అసిస్టెంట్ పెండ్యాల బాబు, సిబ్బంది ప్రదీప్ కుమార్, సాయి ప్రసన్న, రాజు, సుధాకర్, సాంబమూర్తి, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# 'పనుల జాతర'తో వర్ధన్నపేట అభివృద్ధి

### ■ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'పనుల జాతర – 2025' కార్యక్రమంలో భాగంగా వరంగల్ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, జిల్లా కలెక్టర్ సత్య శారద దేవితో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. శుక్రవారం వర్ధన్నపేట మండలంలోని దివిటిపల్లి గ్రామంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ. 12.30 లక్షలతో మంజూరైన అంగన్‌వాడీ భవన నిర్మాణానికి, అలాగే కడారిగూడెం గ్రామ పంచాయతీ భవన నిర్మాణం కోసం సుమారు రూ. 20 లక్షల నిధులతో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా దివిటిపల్లి గ్రామస్తులు అంగన్‌వాడీ భవనం మంజూరు చేసినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం, ఉపాధి హామీ కూలీలకు పశువుల కొట్టాలు, మామిడి తోట పెంపకం కోసం మంజూరు పత్రాలను అందజేశారు. వన మహోత్సవంలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ అంగన్‌వాడీ పాఠశాలలను ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల వర్ధన్నపేట నియోజకవర్గం చాలా వెనుకబడిపోయిందని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 18 నెలల్లోనే విద్యార్థుల కోసం రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ తీసుకొచ్చామని తెలిపారు. ఈ ప్రాజెక్టు మంజూరు చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. యూరియా కొరతపై గత ప్రభుత్వాలు అనవసరంగా రాజకీయాలు చేస్తున్నాయని ఎమ్మెల్యే ఆరోపించారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ యూరియా విషయంలో తమదే తప్పిదమని మీడియా ముందే ఒప్పుకున్నారని గుర్తు చేశారు. రాష్ట్రానికి రావాల్సిన కోటా రెండు రోజుల్లో అందుతుందని, రైతులు అధైర్య పడొద్దని సూచించారు. నానో యూరియా లిక్విడ్‌ను డ్రోన్‌తో స్ప్రే చేసే విధంగా వ్యవసాయ శాఖ రైతులకు అవగాహన కల్పిస్తుందన్నారు. గత పాలకులు రాష్ట్రంలో దోచుకు తిన్నారని, ఇందిరమ్మ ఇళ్లు ఒక్కటి కూడా ఇవ్వలేని వారు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారని ఎద్దేవా చేశారు. కడారిగూడెం గ్రామంలో నిర్మాణ దశలో ఉన్న పింగిలి విజయ ఇందిరమ్మ ఇంటిని ఎమ్మెల్యే, కలెక్టర్ కలిసి పరిశీలించారు. వర్ధన్నపేట నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు కాగా, దళిత నియోజకవర్గం కావడంతో మరో 1,500 ఇళ్లు కేటాయించాలని సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి రెడ్డి దృష్టికి తీసుకెళ్లానని ఎమ్మెల్యే తెలిపారు. రానున్న స్థానిక ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని, కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో రామ్ రెడ్డి, డీడబ్ల్యూవో రాజమణి, పంచాయతీ ఈఈ ఇజ్జగిరి, ఏఎంసీ చైర్మన్ నరకుడు వెంకటయ్య, గ్రామ, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

# గణపతి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

### ◆ సీఐ శివకుమార్ సూచన



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** గణపతి నవరాత్రి ఉత్సవాలను ఆహ్లాదకరమైన, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని హనుమకొండ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మచ్చ శివకుమార్ సూచించారు. శుక్రవారం హనుమకొండ పోలీస్ స్టేషన్‌లో మత పెద్దలు, మండపాల నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన ఈ మేరకు స్పష్టం చేశారు. మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసు, ఇతర సంబంధిత శాఖల నుంచి అనుమతులు పొందిన తర్వాతే విగ్రహాలను ప్రతిష్ఠించాలని సీఐ శివకుమార్ పేర్కొన్నారు. పర్యావరణానికి హితమైన మట్టి విగ్రహాలను, సహజ రంగులనే వాడాలని కోరారు. శోభాయాత్రలు పోలీసులు అనుమతించిన మార్గాలు, సమయాల ప్రకారమే జరగాలని, వాటిని మార్చడానికి అనుమతి లేదని తెలిపారు. సౌండ్ సిస్టమ్/డీజే వాడకం రాత్రి 10 గంటల వరకు మాత్రమే అనుమతించబడుతుందని, శబ్ద ప్రమాణాలను పాటించాలని సూచించారు. గణేశ్ విగ్రహాల నిమజ్జనం మున్సిపల్/జీహెచ్ఎంసీ నిర్ణయించిన చెరువులు/ట్యాంకులలోనే చేయాలని, నిమజ్జన శోభాయాత్ర సమయాలను తప్పనిసరిగా పాటించాలని సీఐ తెలిపారు. ప్రజలు, మండపాల నిర్వాహకులు పోలీసులకు సహకరించి పండుగను దిగ్విజయంగా జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ ఎస్ఐలు పరుశరాములు, సతీష్, కిషోర్, ఇతర పోలీస్ సిబ్బంది, కార్పొరేటర్లు వేముల శ్రీనివాస్, పోతుల శ్రీమన్నారాయణ, తోట వెంకన్న, బైరి శ్రవణ్ కుమార్, గాండ్ల స్రవంతి, కల్లూరి పవన్, దర్శన్ సింగ్, మత పెద్దలు మరియు మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

# పాలకుర్తిలో అభివృద్ధి జాతర




### పలు పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

**వరంగల్ వాయిస్, పాలకుర్తి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'పనుల జాతర' కార్యక్రమంలో భాగంగా పాలకుర్తి నియోజకవర్గంలో శుక్రవారం పలు అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. పాలకుర్తి శాసనసభ్యురాలు యశస్విని రెడ్డి వివిధ కార్యక్రమాలలో పాల్గొని వాటిని ప్రారంభించారు. వాల్మీడి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ.. వాల్మీడి గ్రామం నుంచి తిగారం గ్రామం వరకు రూ. 2 కోట్ల 80 లక్షల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే రెండు గ్రామాల మధ్య రవాణా సమస్యలు తొలగిపోయి, రాకపోకలు సులభతరం అవుతాయని ఆమె పేర్కొన్నారు. అనంతరం ఆమె పాలకుర్తి మండల కేంద్రానికి చేరుకొని, రూ. 25 లక్షల వ్యయంతో నిర్మించిన స్త్రీ శక్తి మహిళా భవనంను ప్రారంభించారు. గ్రామీణ మహిళల శక్తివంతమైన భాగస్వామ్యం సమాజ అభివృద్ధికి కీలకమని, ఈ భవనం ద్వారా స్వయం సహాయక సంఘాలు, మహిళా అభివృద్ధి కార్యక్రమాలు మరింత బలోపేతం అవుతాయని ఆమె తెలిపారు.

#### వంతెన, ఆరోగ్య కేంద్రం ప్రారంభం..

అదేవిధంగా, ముత్తారం గ్రామంలో జడ్పీ రోడ్డు ముత్తారం నుంచి పాటిమిడి తండా వరకు రూ. 2 కోట్ల 80 లక్షల వ్యయంతో నిర్మించిన వంతెనను (బ్రిడ్జ్) కూడా ఆమె ప్రారంభించారు. ఈ వంతెనతో వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులు తొలగిపోతాయని ఆమె పేర్కొన్నారు. అనంతరం అదే గ్రామంలో రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (PHC) ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, ఈ కేంద్రం ద్వారా స్థానిక ప్రజలు ఇకపై దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.



# బాలయ్య ఎనర్జీకి ఫిదా అవ్వాల్సిందే

### అఖండ-2 విలన్ ఆది పినిశెట్టి



నందమూరి బాలకృష్ణను చూసినవాళ్లెవరైనా ఆయన ఎనర్జీకి ఫిదా అయిపోవాల్సిందే. తాజాగా టాలెంటెడ్ యాక్టర్ ఆది పినిశెట్టి కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. బాలయ్యతో కలిసి నటించడం ఓ ప్రత్యేక అనుభవంగా మిగిలిందని చెబుతూ, బాలకృష్ణ గారు ఒక వ్యక్తి కాదు... ఓ శక్తి. ఆయన ఒరిజినల్ గా స్క్రీన్ మీద కనిపించేలా నిజ జీవితంలోనూ పవర్ హౌస్ లాంటి వ్యక్తిత్వం కలవారు అంటూ పొగడ్తల వర్షం కురిపించారు. తెలుగులో మోస్ట్ అవైటెడ్ మూవీగా వస్తున్న అఖండ 2 కోసం బాలయ్య–బోయపాటి శ్రీను మళ్లీ కలిశారు. ఈ సినిమాలో ఆది పినిశెట్టి విలన్ పాత్రలో కనిపించనున్నాడు. ఈ విషయమై ఓ ఇంటర్వ్యూలో స్పందించిన ఆయన, బాలయ్య గారి పనితీరు, కష్టపడే తత్వం చాలా మందికి స్ఫూర్తిదాయకం. స్క్రీన్ పైనా, ఆఫ్ స్క్రీన్ పైనా ఆయన ఎనర్జీ అసాధారణం అన్నారు. బోయపాటి శ్రీను దర్శకత్వ శైలిపై ఆది ప్రశంసలు కురిపిస్తూ, ఆయన డైరెక్షన్‌లో ఓ మ్యాజిక్ ఉంటుంది. బాలయ్య – బోయపాటి కాంబినేషన్ అంటేనే ఆడియన్స్‌లో భారీ అంచనాలు ఉంటాయి. అలాంటి సినిమా లో నాకూ ఛాన్స్ రావడం అదృష్టంగా భావిస్తున్నాను‘ అన్నారు. గతంలోనూ బోయపాటి దర్శకత్వంలో పనిచేసిన అనుభవం ఉందని, ఈ సారి మరింత బలమైన పాత్ర దక్కిందని వెల్లడిరచారు.




## చిరుకు అభినందనల వెల్లువ

### మెగాస్టార్‌కు అభినందనల వెల్లువ
### బర్త్‌డే విషెస్ తెలిపిన ప్రముఖులు

'పునాది రాళ్లు' చిత్రంతో తన కెరీర్‌కు పునాది వేసుకొని 'స్వయంకృషి'తో ఉన్నత శిఖరాలను అధిరోహించిన మెగాస్టార్ చిరంజీవి 70వ పుట్టినరోజు జరుపుకుంటున్నారు. దీంతో ఆయనకు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. అభిమానులు, అగ్ర కథనాయకులు ఆయనతో తమకున్న అనుబంధాన్ని పంచుకుంటూ విషెస్ చెబుతున్నారు. 'హ్యాపీ బర్త్‌డే.. వన్ అండ్ ఓన్లీ మెగాస్టార్ చిరంజీవి గారు' అంటూ అల్లు అర్జున్ శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో కలిసి డ్యాన్స్ చేస్తోన్న ఫొటోను పంచుకున్నారు. పుట్టినరోజు శుభాకాంక్షలు డియర్ చిరంజీవి. ఎప్పుడూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని ఇలాంటి పుట్టిన రోజులు ఎన్నో చేసుకోవాలని కోరుకుంటున్నాను అంటూ వెంకటేశ్ విషెస్ తెలిపారు. చరిత్రలో చిరస్థాయిగా.. మా గుండెల్లో చిరుస్థాయిగా. లవ్‌యూ బాస్. హ్యాపీ బర్త్‌డే అంటూ దర్శకుడు హరీశ్ శంకర్ తెలిపారు. నేను చూసిన మొదటి హీరో మా మామయ్య. ఆయన జీవితం నాకు ఆదర్శం. మామ చేతి నడకే ఈ రోజు నా పయనం. ఆయన నేర్పిన నడవడికే ఓ జీవిత పాఠం. మామయ్యే నా సర్వస్వం. కష్టమైనా, సుఖమైనా.. ఆయన తోడుంటే అదే కొండంత ధైర్యం. మామయ్య మాటే నాకు శాసనం. ఎప్పటికీ ఆయనే నా బలం. మీ మెగాస్టార్.. మన మెగాస్టార్.. నా ముద్దుల మామయ్య చిరంజీవి గారికి జన్మదిన శుభాకాంక్షలు అని సాయి దుర్గా తేజ్ తెలిపారు. మెగాస్టార్ చిరంజీవికి పుట్టినరోజు శుభాకాంక్షలు. విశ్వంభర గ్లింప్స్, విజువల్స్ అద్భుతంగా ఉన్నాయని నారా రోహిత్ పేర్కొన్నారు. సెన్సేషన్‌కు 70 ఏళ్లు.. కాలం గడుస్తున్నకొద్దీ మీపై ప్రేమ ఎప్పటికీ పెరుగుతూనే ఉంటుంది. నాలాంటి మిలియన్ల మందిలో స్ఫూర్తి నింపినందుకు కృతజ్ఞతలు సర్ అంటూ తేజ సజ్జా అభిమానం చాటుకున్నారు.

ఇండియన్ సినిమా గాడ్ ఫాదర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు. మీ సినీ ప్రయాణం ఎంతోమందికి ఆదర్శం. మీ ఎనర్జీ ఓ అద్భుతం. మీ తదుపరి సినిమాల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా అని మంచు మనోజ్ అన్నారు. భారతీయ సినిమాకు గర్వకారణం, మిలియన్ల మంది హృదయస్పందన మా అన్నయ్య మెగాస్టార్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు అంటూ దర్శకుడు బాబీ అభిమానం వెలిబుచ్చారు. తనను తాను శిల్పంగా మలచుకొని కొన్ని తరాల్లో స్ఫూర్తినింపిన పద్మవిభూషణ్ చిరంజీవికి గారికి పుట్టినరోజు శుభాకాంక్షలు అని దర్శకుడు వంశీ పైడిపల్లి అన్నారు.



### మన శంకర వరప్రసాద్ టైటిల్ ఖరారు
### - వెంకటేశ్ వాయిస్‌తో విడుదల

సినీ ప్రేక్షకులంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిరంజీవి – అనిల్ రావిపూడి సినిమా –టైటిల్, గ్లింప్స్ ఎట్టకేలకి విడుదలైంది.చిరంజీవి –అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో రూపొందుతోన్న సినిమా –టైటిల్‌ను అధికారికంగా ఖరారు చేశారు. ‘మన శంకర వరప్రసాద్ గారు అనే –టైటిల్ కొద్ది రోజులుగా ఫిల్మ్ నగర్‌లో చక్కర్లు కొడుతుండగా, అదే –టైటిల్‌ని అఫీషియల్‌గా ప్రకటించారు. ఈ –టైటిల్‌ను విక్టరీ వెంకటేష్ వాయిస్ ఓవర్‌తో అందించడం స్పెషల్ హైలైట్. గ్లింప్స్ లో చిరంజీవి సూట్ ధరించి సిగరెట్ తాగుకుంటూ అలా వస్తుండడం చూసి ఫ్యాన్స్ ఆనందం అంతా ఇంతా కాదు. చివరిలో గుర్రం పట్టుకొని నడుచుకుంటూ వచ్చే షాట్ కూడా అదిరిపోయింది. ఇక మన శంకర వర ప్రసాద్ గారు పండక్కి వస్తున్నారు అంటూ వెంకీ చెప్పడం మరో హైలైట్ అయింది. ఈ సినిమా 2026 సంక్రాంతికి థియేటర్లలోకి రాబోతోంది.

### బర్త్‌డే విషెస్ తెలిపిన బాబు

70 ఏళ్ల వయసులోనూ యంగ్ అండ్ ఎనర్జిటిక్, ఇన్‌స్పైరింగ్ లీడర్‌గా నిలుస్తున్న చిరంజీవికి జన్మదిన శుభాకాంక్షలు చెబుతూ, దేశం అంతటా అభిమానుల సందడి కొనసాగుతోంది. మెగాస్టార్ చిరంజీవి గారికి హృదయపూర్వక 70వ జన్మదిన శుభాకాంక్షలు. సినీ ప్రయాణం, ప్రజా జీవితం, సేవా కార్యక్రమాల్లో మీ విశిష్టమైన ప్రస్థానం లక్షలాది మందికి ఎంతో స్ఫూర్తినిచ్చింది. మీ ఉదారత, అంకితభావంతో మరెన్నో జీవితాలకు వెలుగునిస్తూ ముందుకు సాగాలని కోరుకుంటున్నాను. అంటూ ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ట్వీట్ చేశారు.

# సరదాగా సాగిన... పరదా

చాలా రోజుల తర్వాత తెలుగు ప్రేక్షకుల ముందుకొచ్చిన మరో నాయికా ప్రధానమైన చిత్రం 'పరదా' . కమర్షియల్ సినిమాల్లో సగటు– హీరోయిన్‌గా, పక్కింటి అమ్మాయిగానే కనిపించిన అనుపమ పరమేశ్వరన్ ఇందులో ప్రధాన పాత్రధారి. యువ దర్శకుడు ప్రవీణ్ కండ్రేగుల ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. పడతి అనే ఓ కల్పితమైన ఊరు నేపథ్యంలో సాగే కథ ఇది. అక్కడ ప్రతి యువతీ పరదా కప్పుకొనే తిరగాలనేది ఆచారం. పరదా తీసినట్టు– రుజువైతే మాత్రం గ్రామ దేవత జ్వాలమ్మ ముందు ఆత్మార్పణ చేసుకోవాల్సి ఉంటుంది. అనాదిగా వస్తున్న ఆ ఆచారాన్ని కొనసాగిస్తున్న ఊరి యువతి సుబ్బు (అనుపమ పరమేశ్వరన్) ఊహించని రీతిలో చిక్కుల్లో పడుతుంది. పరదా లేని ఆమె ఫొటో బయటకి రావడమే అందుకు కారణం. తాను ఆచారాన్ని తప్పలేదని వేడుకున్నా... ఆత్మార్పణ చేసుకోవాల్సిందే అని ఊరి ప్రజలు తీర్మానం చేస్తారు. ఒక పక్క తాను మనసిచ్చిన రాజేశ్ (రాగ్ మయూర్)తో నిశ్చితార్థానికి సిద్ధం అవుతుండగానే ఇదంతా జరుగుతుంది. ఆచారం ప్రకారం ప్రాణాలైనా వదలాలి, లేదంటే తప్పు చేయలేదనైనా నిరూపించుకోవాలని కోరతారు ఊరి ప్రజలు. దాంతో సుబ్బు తాను తప్పు చేయలేదని వస్తుంది. ఆ ప్రయాణం ఎలా సాగింది? తనకి తోడుగా నిలిచిన రత్న (సంగీ), అమిష్ట (దర్శన రాజేంద్రన్) ఎవరు? ఇంతకీ పరదా లేని సుబ్బు ఫొటో ఎలా బయటికొచ్చింది? పడతి అనే ఊరు అనుసరిస్తున్న కఠినమైన ఆ కట్టుబాటు– వెనక చరిత్ర ఏమిటి?సుబ్బు తాను తప్పు చేయలేదని నిరూపించుకుందా లేదా అన్నకథలో సాగిందీ సినిమా. అప్పుడప్పుడూ కొత్త కథలు అరుదుగా వస్తుంటాయి. చాలా రోజుల తర్వాత తెలుగు తెరపైకి వచ్చిన ఓ కొత్త కథ... 'పరదా'. హీరో, హీరోయిన్, కమర్షియాలిటీ–... తరహా లెక్కల్ని పట్టించుకోకుండా చేసిన ఓ సాహసోపేతమైన ప్రయత్నం. ముగ్గురు మహిళల స్నేహాల్ని, ఒకరి సమస్య కోసం ముగ్గురూ కలిసి చేసిన స్వేచ్ఛా విహారాన్ని అందంగా, ఆలోచన రేకెత్తించేలా ఆవిష్కరిస్తుంది. దైనందిన జీవితాల నుంచి బయటికొచ్చి చేసిన ఆ ప్రయాణం వాళ్లకు ఏం నేర్పింది?వాళ్లలో ఎలాంటి మార్పుని తీసుకొచ్చింది? సమాజం ముందు ఎలాంటి ప్రశ్నల్ని లేవనెత్తిందన్నది ఇందులో కీలకం. లింగ సమానత్వం అంశాన్ని ఓ కొత్త కోణంలో ఆవిష్కరించిదీ చిత్రం. కానీ, ఈ సినిమా అందుకు భిన్నమైన విషయాల్నీ ప్రస్తావించింది. మనుషుల్లో మార్పుని, ఆ అవసరాన్ని సూచిస్తుంది. అయితే, చెబుతున్న కథ కొత్తదైనా... పాతదైనా తెరపై ఎంత ఆసక్తికరంగా సాగిందన్నదే కీలకం. సన్నివేశాలన్నీ ఒక విహారయాత్ర డాక్యుమెంటేషన్‌లా అనిపిస్తుంది తప్ప, కథ కథనాలు ఏమాత్రం ఆసక్తిని రేకెత్తించవు. ముగింపుతోపాటు– పతాక సన్నివేశాలు ఆకట్టు–కుంటాయి. సుబ్బు పాత్రలో ఒదిగిపోయింది అనుపమ పరమేశ్వరన్.



# ఘనంగా కుంకుమ పూజ



ఎల్లం బజార్ సాయి సేవాదళ్ భజన మందిరంలో శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా సాయి సేవాదళ్ వారి ఆధ్వర్యంలో సాయి బంధు మహిళా సభ్యులు ఏర్పాటు చేసిన అష్ట లక్ష్మి ప్రతిమలకు గణపతి పూజ, అష్టలక్ష్మి పూజ, కుంకుమ పూజ కార్యక్రమాలను అత్యంత ఘనంగా నిర్వహించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని పూజారి ఆరుట్ల గోపాల చార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన భక్తులకు సాయి సేవాదళ్ సభ్యులు అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు. **- వరంగల్ వాయిస్, కాశిబుగ్గ**

# ప్రాంతీయ విభేదాలు రెచ్చగొడితే చర్యలు

- **నగరంలో పోలీసులు ఫ్లాగ్ మార్చ్**



**వరంగల్ వాయిస్, క్రైం :** కుల, మత, వర్ణ, ప్రాంతీయ విభేదాలను రెచ్చగొట్టే ఎటువంటి కార్యక్రమాలకు మా పోలీస్ స్టేషన్ పరిధిలో అనుమతులు ఇవ్వడం జరగదని, అలాగే ఎవరైనా ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని మట్టెవాడ ఇన్ స్పెక్టర్ ఎన్.కరుణాకర్ హెచ్చరించారు. మార్వాడీలు, ఇతర ప్రాంతీయ మైనారిటీ సమూహాల భద్రతకు అండగా ఉంటామన్న సందేశాన్ని ఇచ్చేందుకు మధ్యాహ్నం 3.30 గంటల నుంచి 6.30 గంటల వరకు స్పెషల్ పార్టీ సిబ్బంది, పోలీస్ స్టేషన్ సిబ్బంది, ఎస్సైలు సాంబయ్య, శివకృష్ణ, లచ్చయ్య, రాజేందర్, మహిళా, పురుష సిబ్బంది సుమారు 50 మందితో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. మార్వాడిస్ గో బ్యాక్ అనే నినాదంతో రాష్ట్ర వ్యాప్తంగా షాపులు, దుకాణాలు, మార్కెట్ల బంద్ పాటించాలని ఉస్మానియా యూనివర్సిటీ జాక్ ఇచ్చిన పిలుపు మేరకు మట్టేవాడ పీఎస్ పరిధిలోని డాల్ఫిన్ వీధిలో సెల్ ఫోన్ రిపేర్ షాపులు నడుపుకుంటూ జీవిస్తున్న కొందరు స్థానికులు మార్వాడిస్ గో బ్యాక్ బ్యానర్లతో శాంతియుత ప్రదర్శన నిర్వహించారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు ముందస్తు చర్యగా 21 మందిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తీసుకొచ్చి కౌన్సెలింగ్ నిర్వహించినట్లు ఇన్ స్పెక్టర్ వెల్లడించారు. మట్టవాడ పీఎస్ పరిధిలోని ఎస్వీఎన్ రోడ్, పాపయ్యపేట చమన్, బట్టల బజార్, డాల్ఫిన్ గల్లి, జేపీఎన్ రోడ్, దుర్గేశ్వర స్వామి టెంపుల్ వీధి, మండి బజార్, పోచమ్మ మైదాన్, గోపాలస్వామి గుడి, ఎంజీఎం సర్కిల్, బల్దియా ఆఫీస్ మీదుగా పోలీస్ స్టేషన్ వరకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. శాంతి భద్రతలకు విఘాథం కలిగించే ఎవరిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

# సర్వీస్ రోడ్లు పూర్తి చేయాలి

- **వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య**
- **కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి వినతి**

**వరంగల్ వాయిస్, న్యూఢిల్లీ :** ఎన్ హెచ్ –163 లోని సర్వీస్ రోడ్ల పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కోరారు. శుక్రవారం ఢిల్లీలో కేంద్ర రహదారి, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని మర్యాదపూర్వకంగా కడియం కావ్య కలిశారు. ఈ సందర్భంగా యాదాద్రి–వరంగల్ జాతీయ రహదారి 163 (హైదరాబాద్–భూపాలపట్నం రోడ్) లో పెండింగ్‌లో ఉన్న సర్వీస్ రోడ్ల నిర్మాణాన్ని త్వరతగతిన పూర్తి చేయాలని కేంద్ర మంత్రికి వినతి పత్రం అందజేశారు. నేషనల్ హైవేను నాలుగు లైన్లుగా విస్తరించినప్పటికీ, కొన్ని గ్రామాల వద్ద సర్వీస్ రోడ్లు అనుసంధానం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎంపీ కేంద్ర మంత్రికి వివరించారు. నిడిగొండ, రఘునాథపల్లి, చాగల్, స్టేషన్ ఘనపూర్, చిన్నపెండ్యాల్, కరుణాపురం గ్రామాల వద్ద రోడ్లు ఉన్నా, జనగాం నుంచి ఈ గ్రామాల మధ్యలో లింకులు లేకపోవడం పెద్ద సమస్యగా మారిందన్నారు. దీంతో గ్రామాల వాహనాలు నేరుగా ప్రధాన హైవేపైకి రావడం వల్ల రద్దీ పెరుగుతోందని, ప్రమాదాలు జరుగుతున్నాయని ఎంపీ డాక్టర్ కడియం కావ్య తెలిపారు. వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య విజ్ఞప్తికి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించారు. ఈ విషయాన్ని పరిశీలిస్తానని, అవసరమైన సూచనలు సంబంధిత అధికారులకు ఇస్తామని హామీ ఇచ్చినట్లు ఎంపీ డాక్టర్ కడియం కావ్య తెలిపారు.

# కామారెడ్డి డిక్లరేషన్ అమలు ఏమైంది..?



**వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బీసీలకు అన్ని రంగాలలో మేలు చేస్తామని చెప్పి, కామారెడ్డిలో ప్రవేశపెట్టిన బీసీ డిక్లరేషన్‌లోని హామీలు ఏమయ్యాయని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గౌడ కల్లుగీత వృత్తిదారుల ఉపాధిని పెంచే విధంగా నూతన మద్యం పాలసీని ప్రభుత్వం పునఃసమీక్షించాలని ఆయన కోరారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ ప్రకారం వైన్ షాపుల్లో గౌడ్‌లకు 25శాతం రిజర్వేషన్లు కల్పించి ప్రభుత్వం తన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. మద్యం షాపుల వల్ల గీత కార్మికులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని, అందుకే వారికి 25శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. గ్రామాల్లో విచ్చలవిడిగా నడుస్తున్న బెల్టు షాపుల కారణంగా కల్లు అమ్ముడుపోక గీత కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని వేణుగోపాల్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న 15శాతం మద్యం షాపుల వాటాను 25శాతానికి పెంచి, గౌడ సొసైటీలను ప్రోత్సహించాలని కోరారు. పాత పద్ధతిలోనే టెండర్లు నిర్వహిస్తే గౌడ కులస్తులందరూ ఆ ప్రక్రియను అడ్డుకుంటారని ఆయన హెచ్చరించారు.

# విద్యా ప్రమాణాలు బాగుండాలి

- **హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్**
- **అంగన్వాడి కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు**



**వరంగల్ వాయిస్, హసన్ పర్తి :** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అందించే విద్యా ప్రమాణాలు బాగుండాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఉపాధ్యాయులకు సూచించారు. హసన్ పర్తి మండలం వంగపహాడ్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఇదే ప్రాంగణంలో నిర్వహిస్తున్న అంగన్వాడి కేంద్రాలను జిల్లా కలెక్టర్ శుక్రవారం తనిఖీ చేశారు. ముందుగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పలు తరగతులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఏడు, పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. పదో తరగతి గదిలో సాంఘిక శాస్త్రంలోని జాతియోధ్యమ పాఠ్యాంశాన్ని ఉపాధ్యాయుడు బోధిస్తుండగా పాఠ్యాంశంలో ఉన్నట్లుగా దేశ పటాన్ని చూపిస్తూ ఆనాటి ప్రాంతాలను విద్యార్థులు గుర్తించాలని కలెక్టర్ సూచించగా విద్యార్థులు గుర్తించారు. లెర్నింగ్ ఇంప్రూవ్మెంట్ ప్రోగ్రాంలో భాగంగా ఉపాధ్యాయులు నిర్వహించిన ప్రారంభ పరీక్ష, దానికి సంబంధించిన జవాబు పత్రాలను కలెక్టర్ పరిశీలించారు. ఏడో తరగతి విద్యార్థులతో ఆ ప్రశ్న పత్రంలోని ప్రశ్నలకు విద్యార్థులను కలెక్టర్ జవాబులు అడిగారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను ఉపాధ్యాయులు మెరుగుపరచాలని సూచించారు. త్వరలో పాఠశాలను మళ్లీ సందర్శిస్తానని, ఆ రోజు నాటికి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మరింత మెరుగుపరచాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యా ప్రమాణాలతో పాఠ్యాంశాల బోధన సాగించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అదేవిధంగా పాఠశాల ప్రాంగణంలోనే ఉన్న అంగన్వాడీ కేంద్రాలను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రానికి వచ్చే చిన్నారుల సంఖ్య, అక్కడ అందుతున్న సౌకర్యాలను గురించి ఆరా తీశారు. గ్రామానికి చెందిన విద్యార్థులు బయటకు వెళ్లి చదువుకోవడానికి గల కారణాలపై నివేదికను సమర్పించాలని ఎంఈఓ శ్రీనివాస్ ను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి, స్థానిక తహసీల్దార్ చల్లా ప్రసాద్, ఎంఈఓ శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**పెన్షనర్ల వర్క్ షాప్..**

హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ప్రధాన సమావేశం మందిరంలో శుక్రవారం హనుమకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు పెన్షన్, జీపీఎఫ్ అదాలత్, పెన్షన్ కు సంబంధించి వర్క్ షాప్, జీపీఎఫ్ ఖాతాలకు సంబందించిన వర్క్ షాప్ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ చందా పండిట్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో హైదరాబాద్ ఏజీ కార్యాలయం నుంచి డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ అభయ్ అనిల్ సొనర్కర్, నరేష్ కుమార్ తో పాటు హనుమకొండ జిల్లా డీటీఓ శ్రీనివాస కుమార్, వరంగల్ హనుమకొండ, వరంగల్ డీఆర్ఓలు వైవీ గణేష్, విజయలక్ష్మి, ఉమ్మడి వరంగల్ జిల్లాల డీడీఓలు, పెన్షనర్లు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# కమిషనర్‌ను కలిసిన డీసీ

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఇటీవల బల్దియా డిప్యూటీ కమిషనర్ గా నియమితులైన సమ్మయ్య శుక్రవారం గ్రేటర్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ ని బల్దియా ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్ లో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ డిప్యూటీ కమిషనర్ కు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సమ్మయ్య మేయర్ గుండు సుధారాణిని కూడా మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com